



పోకల చంద్రశేఖ

"రాత్రంతా నాకు నిద్రపట్టలేదండీ" సీనియర్ క్లర్కు మాటలను యధాలాపంగా విని ఊరుకుంది మాలతి.

"పోస్ట్‌మాన్ ఏ నిమిషాన తలుపుతట్టాడో 'పెళ్ళిగ్రాంసార్' అని."

"ఎందుకూ ? లాటరీ డ్రా నిన్న జరిగి వుంటుంది కదూ. అయితే మనకిక రానట్టేగా." నిరాశగా అన్నాడు అక్కౌంటెంట్.

"ఆఁ, యిక రానట్లే" దిగులుగా నవ్వాడతను.

"ప్చ ! మనలాటివారికి లాటరీ ఛాన్సు దొరుకుతుందా ?" అందరి బలవంతంమీదా మొహమాటంతో తనూ ఓ టికెట్టు తీసుకుని- తనకీసారి అదృష్టం కలుగుతుందేమోననే ఆశను అంతర్గతంగా పెంచుకుంటున్న మాలతి నీరసంగా నిట్టూర్చింది.

"నిన్నేకదూ డ్రా. అంతలో రిజల్ట్సు తెలిసిపోతాయా ? సాయంత్రానికి యింటికెళ్ళేసరికి వస్తుందేమో. పడిపోయిన ఆశను మళ్ళీ నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నాడు అక్కౌంటెంట్.

"పోనీయండిసార్ ! ఈ లాటరీ లక్షలు వచ్చిన దగ్గర్నించి మనసుకు శాంతి అనేదిలేకుండా పోతుంది. వస్తుందేమో అనే ఆశతో ఒకరాత్రి నిద్ర చెడగొట్టుకున్నామా. ఇక నిజంగా వస్తే...... ఖర్చయ్యేదాకా నిద్రరాదు. ఎందుకొచ్చిన బాధలెండి? రాకుండా వుంటేనే నయం. ఆ డబ్బు వచ్చినప్పటినుంచి ఎన్ని తిప్పలనుకున్నారు? ఎక్కడలేని చుట్టాలు పుట్టుకొస్తారు. "వెధవ మొహమాటలు...వీధిలో కెళ్తే- "లక్ష కొట్టేసిన వాడదిగో" అని లక్షకళ్ళు మనవైపే వుంటాయి. అంత డబ్బు వచ్చాక ఎక్కడ దాయాలో...ఎలా ఖర్చు పెట్టాలో అన్నీ సమస్యలే. మొన్నీ మధ్య ఏదో పత్రికలో ఈ బాధలన్నీ వ్రాశారు. అవంతా అక్షరాలా నిజమేనండీ..." ఏకరువు పెడ్తున్నాడు సీనియర్‌క్లర్కు.

"లక్ష ఏమూలకయ్యా బాబూ! ఖర్చుపెట్టడం కష్టమంటున్నావు. మంచి మాగాణీ భూములు పదెకరాల కన్నా ఎక్కువ రావు. మనకుండే అప్పులన్నిటికీ ఐదారు వేలు పోనే పోతాయి. ఆడపిల్ల పెళ్ళి పెట్టుకుంటేసరి...ఎక్కడి డబ్బు అక్కడ హూష్ కాకీ..." అభినయంతో దీర్ఘాలు తీస్తూ జమా ఖర్చులు తిరగేస్తున్న అక్కౌంటెంట్‌గారిని చూసి నవ్వేసింది మాలతి.

"నువ్వే చెప్పమ్మా... లక్ష రూపాయలు ఖర్చు పెట్టలేమా-ఆఫ్టరాల్ ఓ లక్ష. మనలాటి కుటుంబాలకు ఏమూల."

తనను కూడా ఆ రంగంలోకి లాగుతున్నందుకు భయపడి పోయిందామె.

"ఎందుకు ఖర్చు పెట్టమండీ ? ఆ వ్యాసంలో వ్రాసినట్లు ఆఖర్చులు సమంజసమైనవిగా వుండవు. మనిషిని-మనిషి వ్యక్తిత్వాన్ని తినేస్తాయి. కష్టపడకుండా వచ్చిన డబ్బు...ఆ రకంగానే నాశనమైపోతుంది." సీనియర్ క్లర్కు ఆపేశంలో ... పత్రికలోపడ్డ వ్యాసాన్ని మెచ్చుకుంటున్నాడో ఎన్నిసార్లు టికెట్లు కొన్నా ... యింతవరకూ తనకా

లాటరీ తగలనందుకు వుక్రోషపడ్తున్నాడో అర్థం కాలేదు.

"అది వేరే విషయం..." తన వాదాన్ని బల పర్చుకునేందుకు మొదలు పెట్టిన అక్కౌంటెంట్ ఆఫీసర్‌గారి దగ్గర్నించి పిలుపురాగానే హడావిడిగా లేచి వెళ్ళిపోయాడు.

" బతికాం" అనుకుంది మాలతి.

*　　　*　　　*

"ఏమిటమ్మాయ్? అంత నీరసంగా వున్నావివ్వాళ?" ఆఫీసునుంచి రాగానే తల్లి శారదమ్మ పలకరింపుకు నీరసంగా నవ్వింది మాలతి "ఏం లేదం"టూ.

"నీ లాటరీటికెట్ సంగతేమిటో తేలిపోయిందా అక్కా?" అల్లరిగా అడిగింది మాధురి.

"ఈవినింగ్ ఎడిషన్‌లో లాటరీ రిజల్ట్సు ఏమీ పడలేదు చెల్లాయ్! ఈ నైట్ వస్తుందేమో టెలిగ్రామ్" నవ్వుదాచుకుంటూ అన్నాడు మధుమూర్తి

"ఆ లాటరీ డబ్బులకోసం నేనేం ఎదురు చూడటం లేదులే. నాకొస్తే - అందులో ఎంతో ఒకంత దక్కకపోతుందా అవి నీ ఆశ. అందుకే యింత తొందర పడ్తున్నావ్." వుక్రోషంగా అనేసి వెళ్ళిపోయింది మాలతి.

"అన్నం సరిగా తినటం లేదేం మాలా? భోజనాలప్పుడు పరధ్యానగావున్న కూతుర్నిచూస్తూ అన్నారు రఘుపతిగారు.

"అదే-ఆ టికెట్ గురించి ఆలోచిస్తోందినాన్నా" వెంటనే అంది మాధురి.

"ఈ లాటరీలు మనిషిని మానసికంగా, శారీరకంగా ఎంత క్రుంగదీస్తాయో వివరిస్తూ ఏదో వ్యాసం పడిందటకదరా అన్నయ్యా?" ఆలోచిస్తూ అడిగింది మాలతి.

"ఔను. మన ఆంధ్రాలో దీన్ని ప్రొహిబిట్ చేయాలనుకుంటున్నారట."

"మద్రాస్ స్టేట్‌లా మొదలెడ్తారా?" కుతూహలంగా అడిగారు రఘుపతిగారు.

"అబ్బే! అలా స్టేట్‌వైడ్ స్టెప్సేం తీసుకోవటం లేదు నాన్నా! పూర్తిగా లేకుండా చేస్తామంటున్నారు."

"అరరె! రూపాయి భాగ్యానికే" బాధపడిపోయారాయన.

వీళ్ళందరి అమాయకత్వాన్నిచూసి నవ్వుకుంది శారదమ్మ.

"అక్కా! గోపాలరావుగారు వచ్చినట్లున్నారే." అడుగుల చప్పుడువిని వంటగదితెర తొలగించి, వంగిచూసి అంది మాధురి.

త్వర త్వరగా చేయి కడిగేసుకుని హాల్లోకి వెళ్ళింది మాలతి.

"నువ్వడిగిన పుస్తకాలు" నవ్వుతూ తన చేతిలోవున్న పుస్తకాలు ఆమె కందించాడు గోపాలరావు

"ఇవి యివ్వటం కోసం మీరింత శ్రమపడి రావాలా?" నొచ్చుకుంటూ అంది.

"నీమాట నేను విన్నా ఈ కాళ్ళు వినవ్‌మరి. ఎంతరాత్రైనా ఒకసారి నీతో మాట్లాడితే ఆ రోజు చాలా హాయిగా గడిచిపోయినట్లుంటుంది నా ప్రాణానికి" చిలిపిగా అంటున్న అతన్ని చూసి సిగ్గుపడింది మాలతి.

"యింతసేపూ ఆఫీస్‌లోనే వర్క్ చేస్తూ కూర్చున్నారా?" సంభాషణ మార్చుతూ అంది.

"ఊ...మన్తెండింగ్‌కదూ ... కొంచెం పని ఎక్కువగా వుంది. అది సరేగానీ...ఈ పుస్తకాలు నువ్వు చదవలేదన్నావ్‌గా అందుకే పట్టుకొచ్చా. చదివి నీ అభిప్రాయ మేమిటో చెప్పు. యిక వెళ్ళనా? రేపు సెలవేగా సాయంత్రం అలా ఎటైనా వెళ్దామా!"

"అలాగే. మా మాధురి సినిమా ప్రోగ్రాం పెట్టకుండావుంటే."

"ఐతే ముందు మధూని బుక్ చేయాలన్నమాట వస్తాను. గుడ్‌నైట్" అనేసి వెళ్ళిపోతున్న అతన్ని చూస్తూ నిలబడిపోయింది మాలతి.

మాలతి పనిచేస్తున్న ఆఫీస్‌కే ...... రెండు సంవత్సరాల క్రిందట ... మాలతీ గోపాలరావులు యింటర్వ్యూకెళ్ళారు. రికమెండేషన్ వున్న మాలతికి

---

"అరేయ్ బాబూ! మన పక్కింటి లోకి కొత్తగా అద్దెకొచ్చిన అమ్మాయికి నువ్వంటే ఎంతో ముద్దంట. నువ్వు ఆమెకో ముద్దంట యిచ్చిరా" అంది తన ఏడేళ్ళ కొడుకుతో.

"అమ్మో! నేనుముద్దివ్వనుబాబూ నాన్నను కొట్టినట్టు చెంపకాయ కొడితే" అన్నాడా బాలుడు.

---

వుద్యోగమొచ్చినందుకు ముందు తెగ వుడుక్కున్నా ఆ తర్వాత తనకి సెంట్రల్ గవర్నమెంటు మంచి పోస్ట్ దొరకటంతో శాంతించాడు గోపాలరావు. ఇంటర్వ్యూనాటి పరిచయం ఆధారంగా తనకూ వుద్యోగం వచ్చిందన్న విషయాన్ని మాలతితో చెప్పటానికి - ఆమె ఆఫీసుకు వచ్చి, ఆమె ఆనందంగా కంగ్రాట్స్ చెప్పడంతో మురిసిపోయి. ఈ పరిచయాన్ని స్నేహం చేసుకుందాం. ఒప్పేసుకోమని మొహమాట పెట్టేశాడామెను. అతని స్నేహంలో ఎటువంటి అవలక్షణాన్ని వెతికినా కనబడకపోయేసరికి మంచి స్నేహితుల...ఆదే ఆత్మీయుల జాబితాలో...కొట్టేసిన బావ రవీంద్ర పేరున్న స్థానే ... గోపాలరావును చేర్చుకుంది మాలతి

"అక్కా! నాకీ లెక్కకి ఆన్సర్ రావటంలేదు చేసి చూపెట్టవ్."

తమ్ముడు మాధవ్, మాలతి ఆలోచనలను చెదరగొట్టేశాడు.

"అన్నయ్య నడుగు చెప్తాడు." వాడికి పాఠం చెప్పటం కన్నా మధ్య మధ్యలో అడిగే యక్షప్రశ్నలకు జవాబు చెప్పటం కష్టం. అందుకే నెమ్మదిగా అక్కడినుంచి వెళ్ళిపోయిందామె.

"అప్పుడే పడుకుంటున్నావేం మాలా?" మంచంవేసుకుని పక్క పరుచుకుంటున్న కూతుర్ని ప్రశ్నించింది శారదమ్మ.

"తల నొప్పిగా వుందమ్మా" నెమ్మదిగా అంది"

"సరె. పడుకో, మాధురిని అన్నయ్య గదిలో పడుకోమని చెప్తాను." లైటార్పేసి-తలుపు దగ్గరికివేసి వెళ్ళిపోయిందామె

*　　　*　　　*

"మాలా-మాలా!" మధుమూర్తి చెల్లెలిని కుదుపుతూ అరిచాడు.

"ఏమిటన్నయ్యా?" ఉలిక్కిపడి లేచింది.

"ఇలా చూడు .... నీకు ...నీకు" టెలిగ్రామ్ కాగితం చేతిలో పట్టుకుని విషయమేమిటో చెప్పకుండా తడబడుతూ వున్న అతని చేతిలో టెలిగ్రామ్ లాక్కుని చూసింది. కాసేపటికి .. విషయమేమిటో తెలిశాక, నిద్రమత్తు కళ్ళల్లోకి విస్మయం, ఆనందం విశాలంగా చోటు చేసుకున్నాయి. అప్పటికే వారిద్దరి చుట్టూ యింట్లో జనాభా అంతా చేరారు.

"అమ్మా! నాకు లాటరీలో ఫస్ట్‌ప్రైజ్ వచ్చింది" ఎలాగో బయటికి వచ్చాయా మాటలు.

"నిజమే..." మాల చేతిలో టెలిగ్రాం అందరి చేతుల్లోకి మారలేక వుక్కిరి బిక్కిరై పోయింది.

ఏం చేయాలో తోచనితనం... అంత ఆనందాన్ని యింకా ఎవరితో పంచుకోవాలో అర్థం కాని అసహాయస్థితిలో చాలానేపు స్తబ్దుగా వుండిపోయారందరూ.

"ఒరే అన్నయ్యా! యిన్నిరోజులు నన్నేడిపించావ్ లాటరీ లాటరీ అంటూ...యిప్పుడో...?" ఆఖరికి - టెలిగ్రామ్‌లో బరువుగా వున్న విషయం తన గుండెల్లో సరిగా సర్దుకున్నాక నవ్వుతూ అంది మాలతి

సంతోషం సగం బలమంటారు. అది నిజమో కాదో గానీ...ఎక్కువ సంతోషం మనిషిని నీరసింప చేస్తుంది. అలాగే వుంది మధుమూర్తి పరిస్థితి. మధుమూర్తి దేం ఖర్మ ... అందరూ ఆరోగ్యవంతమైన నీరసంలో వున్నారు.

"ఎలా ఐనా మాల అదృష్టవంతురాలు." రఘుపతిగారు అభినందించారు.

అమ్మా! నాకు నిద్దరొస్తోంది." ఆవులించాడు మాధవ్. ఆవేదనానందాలను స్వీకరించని అందమైన అల్లరి వయసు వాడిది.

"అందరూ పడుకుందాం పదండి, రేపట్నించి ఎలానూ తప్పదు మేల్కొనటం" శారదమ్మ లేచింది.

"యిక నిద్రపట్టుందంటావా?" అనుమానంగా చూశారు రఘుపతిగారు భార్యవైపు.

"ఈ టెలిగ్రాం ప్రొద్దున్న వచ్చినాబావుండేది" మాధురి అంది, విసుక్కోవాలో, మానాలో తెలేని పరిస్థితిలో.

"చెల్లాయ్! యింతడబ్బు ఏం చేసుకుంటాం మనం." మాల ముఖంలోకి పసివాడిలా చూశాడు మధుమూర్తి.

చిన్నగా నవ్వింది మాలతి..."రేపు ఆలోచిద్దాం అన్నయ్యా."

"యెస్ గుడ్‌నైట్ మేడమ్."

"యిదెప్పటినుంచి."

"నువ్వు లక్షాధికారిణివయిన క్షణంనుంచి"

నవ్వేసి వెళ్ళిపోయాడు మధుమూర్తి.

ఎన్నో యుగాలతర్వాత తెల్లారింది.

రాత్రి జరిగింది నిజమా, కలా నిర్ధారణ చేసుకుందుకు డ్రాయర్లో ఎర్రగా అరుణరేఖలా మెరిసిపోతున్న టెలిగ్రాంను అందరూ ఓ సారి చూసి వచ్చారు.

అక్కా ! నువ్వింక ఆఫీస్ కెళ్ళాల్సిన అవసరం లేదుగా" హఠాత్తుగా అన్నాడు మాధవ్.

ఉద్యోగంచేసే ఖర్మేం పట్టిందిరా అక్కకు." రఘుపతిగారు నవ్వారు.

"లేదునాన్నా ! యిలా లాటరీలో వచ్చినడబ్బు ఎన్నాళ్ళుంటుందో ఏంపాడో ? నేసి ఉద్యోగాన్ని మానేయదల్చుకోలేదు." గంభీరంగా అంటున్న మాలతికేసి అందరూ విస్తుపోయి చూచారు.

"అందరూ నవ్వుతారు. డబ్బుమీద యింత కాపీనమేమిటని ?" మధుమూర్తి అన్నాడు.

"ఏదో పరిస్థితులు కలసిరాక యిన్నాళ్ళు ఉద్యోగం చేయిచాంగానీ... మన యిళ్ళల్లో ఆడపిల్లలు ఉద్యోగంచేసే అలవాటులేదు మాలా."

తండ్రికేసి ఆశ్చర్యంగా చూసింది మాలతి. "డిగ్రీపరీక్షలు వ్రాయటం అవకముందే ఉద్యోగ ప్రయత్నాలుచేసి... టైప్ నేర్చుకోమని తొందరపెట్టిన నాన్నగారేనా ఈయన ? తమ ఆర్థిక పరిస్థితులేం మరీ అంత ఘోరంగాలేవు. అప్పటికి అన్నయ్య సంపాదన పరుడయ్యాడుకూడా..." మౌనంగా లేచి వెళ్ళిపోయింది అక్కడ్నించి.

న్యూస్ పేపర్లో ఈ విషయం తెలుసుకున్న జనం ఒక్కరొక్కరే రావడం మొదలెట్టారు.

"మీ యింట్లో.మాలతిపుట్టినప్పుడే అనుకున్నాను మొదటి ఆడపిల్ల శుక్రవారంనాడు లక్ష్మీదేవిలా వెలిసిందని."

తన గదిలో కూర్చుని వింటున్న మాలతి, తను ఏ రోజు పుట్టిందో జ్ఞాపకం తెచ్చుకుంటోంది.

"రఘుపతిగారూ ! మీ దశ తిరిగి పోయిందండీ ఈనాటితో. శాస్త్ర మమ్మల్నే కంటకని పెట్టి వుండండి..." దీనంగా, వికారంగా నవ్వుతున్నారెవరో.

"పెద్ద ఎత్తున ఏదన్నా బిజినెస్ మొదలెట్టు... యింతకింతా కలిసి వస్తుంది." ఎన్నోసార్లు దివాలా తీసి యింకా ఆ ఆకర్షణనుంచి తప్పుకోని పెద్ద మనిషి...

"సెంటర్లో మంచి బంగళా అమ్మకానికుంది చూసొద్దాం రండి" బ్రోకర్ ఘోష.

"ఆడపిల్లలు అదృష్టదేవత అంశలు బాబాయ్ గారూ !" చెప్తున్న అతను...చేసిన హితబోధల్ని బెదిరింపుల్ని లెఖ్ఖచేయకుండా పెళ్లాం ఆడపిల్లనే కందని అలిగి మామగారికి జరిమానా వేశాడెంతో- అభినందించడానికి వస్తున్నారు ఎంతోమంది... తమకి చాలా ఆనందంగా వుందంటూ అసూయ నిండిన స్వరాలతో.


వాళ్ళందరికీ చిరునవ్వుతో...గర్వంతో ఓపిగ్గా-దర్పంగా సమాధానాలిస్తున్నారు రఘుపతిగారు.

లోపలి గదిలో యిదే పరిస్థితి నెదుర్కొంటోంది శారదమ్మ.

"పిన్నిగారూ . వదినా - అమ్మడూ" అంటూ ఎక్కడలేని ఆప్యాయత వొలకపోస్తున్న ఆడ జనంతో ఆమెకసలు వూపిరాడటంలేదు. అప్పుడే టెలిగ్రాములు వస్తున్నాయి అభినందనలతో ... రెక్కలు గట్టుకు వాలలేని తమ అసహాయతకు విచారిస్తున్న బంధుకోటి దగ్గర్నించి.

"అక్కా ! ఈ టెలిగ్రామ్‌లు చించి చదవటానికి వచ్చిన జనాన్ని సత్కరించి పంపటానికి ఓ సెక్రటరీని అర్జంట్‌గా అప్పాయింట్ చేసుకోవాలి మనం" మాధురి అంది విసుగ్గా.

"నన్ను నీ సెక్రటరీగా తీసుకోవే చెల్లాయ్." అప్పుడే వచ్చిన మూర్తి అందుకున్నాడు.




"సిగ్గులేదూ...ఆ మాటనడానికి." నవ్వుతూనే మందలించింది మాలతి.

"చెల్లాయ్ ! బావదగ్గర్నించి టెలిగ్రామ్‌వచ్చిందే తను వస్తున్నట్లు."

"ఈ కారణంగానైనా ఈ రెండు కుటుంబాలు మళ్ళీ దగ్గరవుతే అంతేచాలు." అటునించి వెళ్తూ విన్న శారదమ్మ అంది.

"ఎవడికోసం దగ్గరవుతారే ? అంత అహంకారంతో వెళ్ళిపోయిన నీ అన్నయ్యను చూచి ఆనాడే అనుకున్నాను ... ఏనాటికో నాటికి దిగి రాకుండా వుంటాడా అని..." మీసం దువ్వుకున్నారు రఘుపతిగారు.

వీళ్ళందరి మాటలు వింటూ బొమ్మలా కూర్చుండి పోయింది మాలతి.

ఆమెను ఒంటరిగా వదిలేసి ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు.

"కంగ్రాచ్యులేషన్స్ అండీ! మాలతెక్కడుంది?" గోపాలరావు గొంతు విన్పించగానే దిగ్గున లేచింది మాలతి.

"అమ్మాయి ఈ హడావుడికి హడలిపోయిందోయ్. అందులో రాత్రంతా నిద్రలేదా-తలనెప్పని పడుకుందిందాకే. నువ్వు వచ్చి వెళ్ళావని చెప్తాలే బాబూ" మర్యాదగా ఫేర్‌వెల్ చెబుతున్న తండ్రి మాటలు వింటూ అచేతనంగా వుండిపోయింది.

"ఫర్వాలేదు పడుకోనివ్వండి - నే వెళ్తున్నాను" భారంగా అనేసి వెళ్ళిపోతున్న గోపాలరావు ప్రతిబింబం ఆమె కళ్ళల్లో విలవిల్లాడిపోయింది. వెనక్కి తిరిగి తన పక్కమీద పడుకుంది...తల దిండులో దూర్చేసి. చీకటి పడ్తుండగా రవీంద్ర వచ్చాడు చిన్న సూట్‌కేసుతో.

"నమస్కారం మామయ్యా ! బాగున్నావా అత్తా ! పిల్లలు కన్పించరేం ? మాలతేది !" హడావిడిగా వరుసగా కుశల ప్రశ్నలు వేసేస్తున్న మేనల్లుడ్ని ఆప్యాయంగా పలకరించింది శారదమ్మ.

గతం గుర్తుకు తెచ్చుకుంటూ కొంచెంసేపు బింకంగా కూర్చున్నారు రఘుపతి. గలగల మాట్లాడుతూ ఏ మనస్పర్థలు తమమధ్య అసలెన్నడూ జరగనంత స్వాభావికంగా ప్రవర్తిస్తుంటే ... ఆయన దిగి రాక తప్పలేదు.

"మామయ్యా ! మాలతి కన్పించదేం ?" అప్పటికి మూడోసారో నాలుగోసారో అడుగుతున్న అల్లుడ్ని చూసి నవ్వుకున్నాడాయన.

"తన గదిలో వుంది వెళ్ళి పలకరించిరా !"

తలుపు నెమ్మదిగా తోసుకుని లోపలికి వెళ్ళాడు రవీంద్ర కిటికీ దగ్గరగా కుర్చీ వేసుకుని... మసగ్గా..... చీకటిగా కన్పిస్తున్న ప్రకృతికేసి తదేకంగా చూస్తోంది మాలతి.

"లతా !" పిలిచాడు రవీంద్ర.

ఎన్నాళ్ళ తర్వాత మళ్ళీ ఈ మధురమైన స్వరాన్ని వింటోంది! అతను...తనను తప్పించుకుని పారిపోయిన ఈ మధ్యకాలంలో ... బావపై ఎంతో ద్వేషాన్ని పెంచుకుంది. తను అమితంగా ద్వేషించే రవీంద్ర తన ఎదురుగా నిలబడి ఎప్పటిలానే 'లతా' అని మృదువుగా పిలుస్తుంటే... పూర్కుంటోందెందుకు మనసు? తిరస్కారంగా

అతనికి దూరంగా వెళ్ళిపోదామన్నా సాధ్యం కావటం లేదేం?

ఆశ్చర్యంగా అనుకుంటోంది మాలతి.

"ఇంకా నీకు నా మీద కోపం పోలేదా?" అనునయంగా అడుగుతున్నాడతను.

"ఏసేం చేయను చెప్పు? డాక్టర్ కోర్సు పూర్తి చేసుకోగానే... అంతవరకూ నా చదువుకని చేసిన అప్పులు తీర్చటం కోసం మిమ్మల్నిలా అవగాల్సి వచ్చింది. అందులో నా ప్రమేయమేం లేదు. నన్ను నమ్మవా లతా!" జాలిగా చూస్తున్న అతని వేపు చూడకుండా తలదించుకుంది మాలతి.

"నిజంగా నీ మీద ప్రేమలేని వాణ్ణయితే... యింతవరకూ నీ కోసం ఎదురుచూస్తూ యిలా ఒంటరి జీవితం గడిపేవాడినా? అమ్మ నాన్నల పత్తిడిని లెక్క చేయకుండా యిలా ఈ రెండేళ్ళ నీ పేరే జపిస్తూ...నీవు దగ్గరవ్వాలని పరితపిస్తూ వుంటానా?"

మాలతి పెదాల మీద పరిహాస రేఖ చోటుచేసుకుంది.

ఈ రెండేళ్ళలో ప్రాక్టీస్ పెరిగి...మంచి డాక్టరతను అని పేరు తెచ్చుకుంటే...కట్నం రేటు యింకో బదు వేలకు పెంచుదామని కాదూ...వీళ్ళ వుద్దేశ్యం. పనిపిల్లలను మరిపించేందుకులా అందమైన మాటలు వ్యర్థంగా వాడుతున్నాడు బావ...అనుకుందామె.

"లతా! నిజంగా నేను నువ్వూహించే వుద్దేశ్యంతోనే నిన్ను వదులుకునేందుకు సిద్ధపడ్డాను. పోనీ నువ్వే చెప్పు ... నువ్వే ఆ పరిస్థితులలో వుంటే ఏం చేసేదానివి? ఈనాటి పరిస్థితులు ... ధన వ్యామోహం యిని ప్రేమను ... మనసులమధ్య పవిత్రమైన ఆకర్షణను జయించేస్తున్నాయి. నువ్వు వీటన్నింటికి అతీతంగా నిలిచి నీ మనసునుమాత్రమే తృప్తిపరచుకోగలవా? చెప్పు లతా! నేను నిన్ను ప్రేమించాను. కాని పరిస్థితుల ఒత్తిడివల్ల, స్వార్థాన్నించి తప్పుకోలేకపోయాను. నా తర్వాత యింకా యిద్దరు ఆడపిల్లలున్నారు. చదువుకునే తమ్ముడున్నాడు. నువ్వే చెప్పేయ్. ఆ పరిస్థితులలో వుండేవారు వేరే విధంగా ప్రవర్తించటానికి అవకాశాలున్నాయని" ఆవేశంగా అంటున్న రవీంద్రను సాలోచనగా చూస్తుండి పోయింది మాలతి.

"ఔను బావా! మనం దేవతలంకాదు ...స్వార్థాలకు ప్రలోభాలకు అతీతంగా ప్రవర్తించటానికి. తలిదండ్రుల ప్రేమను – వారిపట్ల మనకున్న బాధ్యతను విస్మరించటానికి మనం రాక్షసులమూ కాదు" తనలో తను అనుకుంటున్నట్లుగా ... అతి నెమ్మదిగా అంది బాలాసేపటికి.

"ఔను లతా! మనం వట్టి మనుషులం. రాగద్వేషాల కతీతంగా మనలేం' –వుత్సాహం తెచ్చుకుంటూ అన్నాడు రవీంద్ర.

"రాగద్వేషాల కతీతంగా మనలేమేమోగానీ ఒకసారి ద్వేషించిన మనిషిని తిరిగి ప్రేమించటం మాత్రం అంత సులభసాధ్యంకాదు." ఎటోచూస్తూ అంది.

"లతా!" దీనంగావుంది అతని స్వరం.

"ప్రయత్నిస్తే సాధ్యంకానిదేదీలేదు.' జాలిగా ధ్వనిస్తున్న అతనికంఠం వింటుంటే నవ్వొస్తోంది మాలతికి.

"మనసును చంపేసుకుంటే... మనుషకి మనవతకి జోలపాడి నిదురపుచ్చేస్తే ఏదన్నా సాధ్యమే మనిషికి." వెటకారంగా అనాలనుకుని ఆగిపోయింది. ఈమాట అనేస్తే బావమనసు బాధపడకపోయినా బావ బాధపడ్డాడు. రేపు తనే ఈ పరిస్థితులలో చిక్కుకుని తనమనసుకి విరుద్ధంగా ప్రవర్తించాల్సి వస్తే... మాట తూలనందుకు తనను తనే అభినందించుకుందామె.

"నన్నాలోచించుకోనీయ్ బావా!" ఆ సంభాషణను తుంచేస్తూ అంది.

"నీ యిష్టం. ఎంతకాలమైనా ఆలోచించుకో. కానీ ఈసారి నీ తొందరపాటు కారణంగా మన జీవితాలను దూరం చేసుకోవద్దు.

"ఊఁ" చిన్నగా నవ్వింది మాలతి.

* * *

మరునాడు వుదయం పదింటికి ఆఫీస్ కి తయారవుతున్న మాలతిని చూచి అందరూ ముఖాలు గంటు పెట్టుకున్నారు. రఘుపతిగారికి కోపంకూడా వచ్చింది.

"ఆ"నేమిటి మామయ్యా! ఆ డబ్బు వచ్చేసరికి యింకో పది రోజులైనా పడుతుంది. ఈ లోపుగా తనతో కలసి పనిచేసిన వారందరి దగ్గరా సెలవు పుచ్చుకోవటం...ఆఫీస్ వ్యవహారాలన్నీ ఫైనలైజ్ చేసుకోవటం ... ఎన్ని పనులున్నాయి? కనీసం వాళ్ళందరి దగ్గరా కంగ్రాట్స్ నా అందుకోవద్దా." అని రవీంద్ర సర్దిచెప్పాక వూరుకున్నారందరూ.

బావ చమత్కారానికి కోపం వచ్చినా మెచ్చుకోకుండా వుండలేకపోయింది మాలతి. మౌనంగా గేటుదాటి వెళ్ళిపోయింది.

"కంగ్రాచ్యులేషన్స్ మాలతిగారూ! వద్దు వద్దంటూ కట్టినా ఛాన్స్ కొట్టేశారు." విన్న ఈ గొడవనంతటినీ రఘుపతిగారు, శారదమ్మ భరిస్తుంటే జాలిగా అన్పించిన మాలతికి ఈరోజు అదే పరిస్థితినితనూ ఎదుర్కొవటానికి వచ్చేసరికిచిరాకేసింది.

"బ్రహ్మాండమైన పార్టీ యిస్తేగానీ, మేం మీ రిజిగ్నేషన్ అక్సెప్ట్ చేయం." అందరూ పట్టు పడుతుంటే హడలిపోయింది.

"తనీ ఆఫీస్ లో ఉద్యోగం చేస్తానని అరచి గీ పెట్టినా విన్పించుకోరులావుంది వీళ్ళు. బలవంతంగ నైనా యిక్కడ్నించి తరిమేస్తారుగ బోలు" బిక్క మొహంతో అందర్నిచూస్తూ నిలబడి పోయిందామె.

ఆఖరిరోజు ... పార్టీలు వుపన్యాసాలు అన్నీ అయ్యాక ఫేర్ వెల్ చెప్పేసి పంపేశారు మాలతిని ఇక ఆమెతో తనకేం సంబంధం లేదన్నట్టు. అంతటితో వదిలిపెట్టినందుకు సంతోష పడింది మాలతికూడా.

పేవ్ మెంట్ మీద నిలబడి రిక్షాకోసం చూస్తుంటే గోపాలరావు కనబడ్డాడామెకు. తననుచూసి దూరంగా తప్పుకు పోతున్నట్లనిపించింది. పిలుస్తున్నట్లుగా చూసింది. దగ్గరికి వచ్చాడతను.

"మీకు నేనప్పుడే పరాయిదాన్నైపోయానా గోపాల్?"

కన్నీళ్ళొక్కడే తక్కువగా వున్న ఆమెను నమ్మలేనట్లు పరీక్షగా చూశాడు.

"అమాట నేననాలి మాలా." నెమ్మదిగా అన్నాడు.

"నాకు కలిగిన ఈ అదృష్టం నాలో ఎంత ఆవేదనను రగిలిస్తోందో మీరు అర్థంచేసుకోలేరా?" జాలిగా అంది.

"అదృష్టాలు ఆనందాన్నే కల్గిస్తాయి. ఆవేదన రగిలించేది అదృష్టమెలా అవుతుంది?" నవ్వాడు గోపాలరావు.

"నిజమేకానీ నేను దాన్ని అదృష్టంగా అనుకోవటంలేదు."

"మీరు నన్నీ పరిస్థితులలో విడిచి వెళ్ళకండి" ఈ మాట మాలతి చెప్పబోతుండగా రవీంద్ర వారి ముందు నిలిచాడు.

"కలెక్టర్ కి పంపించారుట చెక్ ని. ఎనిమిదింటికి అక్కడ పార్టీ ఫోటో అదీ వుంది. మనం త్వరగా వెళ్ళాలి పద లతా!" ఏదో మునిగిపోతున్నట్లు మధ్యలో వచ్చిన అతన్ని విసుగ్గా చూసింది.

"నువ్వెళ్ళు మాలా... గుడ్ బై." వడివడిగా అక్కడ్నించి వెళ్ళిపోయాడు గోపాలరావు. రవీంద్రను అనుసరించింది మాలతి.

* * *

ఏజెంట్ కమీషన్...యింకా ఏవో టాక్సులు అవీపోగా ... దగ్గర దగ్గర లక్ష రూపాయలకు యిచ్చిన చెక్కును చూసిన దగ్గర్నించీ ...యింట్లో వాళ్ళెవరికి మనసు మనసులో వున్నట్లు లేదు. బరువుగా వూపిరాడనట్లు వుంది. తేలిగ్గా గాలిలో తేలిపోతున్నట్టూ వుంది. కలలో యిలాటి అవస్థ తటస్థిస్తే వులికిపడి లేచికూర్చుంటాం...తర్వాత అంతమంచి కలను చెడగొట్టుకున్నందుకు ఏడుస్తున్నా. యిప్పుడు వులికిపడి చుట్టూ కలియ చూసినా అందరూ అదే అవస్థలో వున్నారు.

"యింత డబ్బు ఏం చేద్దామమ్మా మనం" డబ్బు కుప్పలుగా తనముందు లేకపోయినా ఎదురుగా కవ్విస్తున్న చెక్కు లక్షింతలుగా కన్పడుతుంటే అడిగింది మాధురి.

"పొలం కొందాం నాన్నగారూ! ఆధునిక పద్ధతులమీద వ్యవసాయం చేద్దాం". అగ్రికల్చర్ బి. యెస్సీ చదివిన మధుమూర్తి అన్నాడు.

"ఊహూఁ వ్యాపారం మొదలెట్టాలని వుంది నాకు." కూలిపోయిన తన ఆశలను పునరుద్ధరించుకోవాలనే దివ్య సంకల్పంతో వున్నాడు రఘుపతిగారు.

"మాల అభిప్రాయమేమిటో కనుక్కోరేం? ఈ డబ్బంతా తనది."

శారదమ్మ మాటలకు అందరి ముఖాలు వెల వెల బోయాయి.

"అసలు ఈ డబ్బంతా నాదికాదు. వీళ్ళదీ కాదు. గోపాల్ ది. ఆ రోజు తన దగ్గర చేంజ్ లేకపోతే ఈవినింగ్ యిచ్చేస్తానంటూ గోపాల్ దగ్గర తీసుకున్న పర్సులో ఓ రూపాయితో కొన్నదీ టికెట్. యిదంతా తనకే దక్కాలి" తనలో తను అనుకుంది మాలతి నేలవైపు చూస్తూ.

"మాట్లాడ వేం లతా! నీ ఓటు మామయ్యకా? బావకా?" నవ్వుతూ అడిగాడు రవీంద్ర.

"అన్నయ్య లాటి వాళ్ళు వ్యవసాయం చేద్దా

మనటం హాస్యాస్పదం. అంత కష్టపడి ఒళ్ళు వంచి పొలం పనులు చేస్తారని నే ననుకోను. యిక వ్యాపారం...మనకు అచ్చిరాదనే విషయం నాన్నగారికి అనుభవైకవేద్యం. మళ్ళీ అ రంగాన్నే ఆశ్రయించటం అంత మంచిది కాదని నా వుద్దేశ్యం." ధైర్యంగా సూటిగా అనేస్తున్న మాలతి వైపు కోపంగా చూశారు తండ్రీ కొడుకు లిద్దరూ.

"ఏ ఫ్యాక్టరీయో ప్రారంభించి ఓ వందమంది జనానికి పని కల్పించ గలిగితే చాలని నా కోరిక."

"ఇలాటి చిలుక పలుకులు అనటం తేలికే. ఆచరించేసరికి తెలిసివస్తుంది. ట్రేడ్ యూనియను స్ట్రైకులు వీటన్నిటి విషయమేమన్నా ఆలోచించావా?" కయ్యానికి దిగుతున్నట్లే మాట్లాడుతున్న తండ్రిని చూస్తే నవ్వొచ్చింది మాలతికి.

"ఇండస్ట్రియల్‌గా దేశాన్ని అభివృద్ధిలోకి తీసుకు రావాలనే నీ ఉద్దేశ్యాన్ని అభినందిస్తున్నాను చెల్లాయ్. అసలు మనదేశం అరిజనేమిటో మర్చి పోతున్నావునువ్వు. మనంముందు వ్యవసాయకంగా ప్రగతి సాధించాలి. ఆహార ధాన్యాల కొరతను ఏమాత్రం తగ్గించినా దేశానికి సేవ చేసినట్టే." వుపన్యాస ధోరణిలో మొదలుపెట్టిన మధుమూర్తిని చూసి అందరూ నవ్వేశారు.

"మామయ్యా! లత ఆలోచన మంచిదే. మన ఋణాలూ, అప్పులూ అవీ పోగా...మిగిలేదాంతో ఫ్యాక్టరీ ఓపెన్ చేయటం కుదరదు.ఏ యిండస్ట్రియల్ కంపెనీలోనన్నా షేర్స్ కొనుక్కుని...ఆ తర్వాత కొంత డబ్బు సమకూడేక సొంతంగా ఫ్యాక్టరీ విషయం ఆలోచించాలి" రవీంద్ర అన్నాడు.

"అన్నిటికన్నాముందు మనం యిక్కడ్నించి షిఫ్ట్ అవ్వాలి. ఏ బెజవాడో, విశాఖపట్నమో పోతే-మన ఆలోచనలకో రూపమంటూ కలుగుతుం దక్కడ. ఈ గుడివాడలో కూర్చుని ఏం ప్రయోజనం! బెజవాడకి మకాం ఎత్తితే యిక్కడికి దగ్గరే కాబట్టి ఫర్వాలేదు అనుకోవచ్చు గానీ ... బంధువుల లాకిడి తప్పదు మనకు. వీళ్ళనించి రక్షణకోసం మనం ఎక్కడైనాపారిపోవాలి దూరంగా" రవీంద్ర మాటలను తల వూగించారందరూ.

"ఐతే మైడాగ్ వెళ్ళిపోదాం మాండీ! రవీ వాళ్ళు అక్కడ స్థిరపడిన వాళ్ళే కాబట్టి కొత్తచోటని మనం బెంగపడే నవసరము లేదు. మాధురిని సంవత్సరం మా పిన్నత్తగారింట్లో వుంచి చదివిస్తే బి. యస్సీ అయిపోతుంది. పై యేడు ఎమ్మెస్సీ అక్కడే చదివించొచ్చు. యిక మధూ విషయం... కొంచెం ప్రయత్నించి ట్రాన్స్‌ఫర్ చేయించు కుంటే సరి." శారదమ్మ అంతా నిర్ణయం చేసేస్తూ అంది.

"అత్తా! నీ అంత త్వరగా నిర్ణయాలు చేసే వాళ్ళుంటే..." నవ్వాడు రవీంద్ర.

"ప్రయాణమయ్యేసరికి ఓ వారం పది రోజులు పట్టుందేమో కదూ!" నెమ్మదిగా అన్నాడు రఘుపతిగారు.

"మాలా! రేపు నువ్వూ-బావా కలసి బెజవాడ కెళ్ళి బట్టలు అవీ కొనుక్కురండి" అంటున్న తల్లివైపు నిర్జీవంగా చూసింది మాలతి. ఈ నాటకంలో రవీంద్ర ఏదో ముఖ్యమైన పాత్ర ధరిస్తున్నట్లనిపించింది ఆమెకు.

ఆ మరునాడు రైల్వేస్టేషన్‌లో...

టికెట్స్ కొనుక్కు రావడానికి రవీంద్ర వెళ్లాడు మాలతి నొక్కదాన్నీ వదలి.

"మాలతీ!" గోపాలరావు కంఠం విన్పించింది.

"ఇదేమిటి యిక్కడ వున్నావు?" ఆదుర్దాగా అడిగాడు.

"వచ్చిన డబ్బుకు తగినట్లు హోదాగా, దర్జాగా కన్పించాలట. అవేవో కొనటానికి బెజవాడ వెళ్తున్నాం నేనూ బావా" పేలవంగా నవ్విందామె.

"అలాగా! నేనో ఫ్రెండ్‌ను రిసీవ్ చేసుకోవడానికి వచ్చానులే...నువ్వొక్కదానివి ప్లాట్‌ఫాం మీద కన్పించేసరికి కొంచెం కంగారుపడ్డాను."

అతని మాటలకు చిన్నగా నవ్వింది మాలతి.

"మీరిచ్చిన పుస్తకాలు యింకా చదవ లేదు" మాటలే మరచిపోయినట్లు మౌనంగా నిలబడిన అతన్ని చూస్తూ అంది.

"పోనీలే...ఈ గందరగోళం మధ్య నీకు వీలు దొరికితే...అప్పుడు నీకు నేను గుర్తుకువస్తే ఆ పుస్తకాలు చదువు ఎప్పుడైనా సరే..."

"అవి మీ కక్కర లేదా?"

"ఊహూఁ. అవి నా కానుక నీకు. చాలా చిన్న కానుక కదూ మాలా!" బలవంతంగా నవ్వాడు గోపాలరావు.

అదురుతున్న పెదవులను నొక్కిపట్టి అతని వైపు నజలనయనాలతో చూసింది మాలతి

"నాకు అప్పుడే వీడ్కోలు చెప్పేస్తున్నారా?" అంది.

"ఇక వెళ్తాను మీ బావ వస్తున్నారు. విష్‌యూ బెస్టాఫ్ లక్." అతను దూరమయిపోయాడు కానేపట్లోనే...

"పద లతా! ట్రైన్ కదుల్తోంది" ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌వైపు లాక్కెళ్ళాడు రవీంద్ర అచేతనంగా నిలబడ్డ ఆమెను.

"నీ ఆలోచన పూర్తయిందా లతా!" ట్రైన్ వేగన్దుకున్న పది నిమిషాలకు అడిగాడు

సన్నగా నవ్వింది మాలతి

"అసలు నువ్విమధ్య మాట్లాడ్డం మానేసావ్"

"యికనుంచి మాటలతో పనేముంది బావా! కను సన్నలతో కాలింగ్ బెల్‌తో మన పనులన్నీ జరిగిపోతాయ్."

"అబ్బ! ఇలా మాట్లాడవద్దనే చెప్పేది. ఇన్ని రోజులు ఆలోచించాక ఏ నిర్ణయానికి వచ్చావో చెప్పమంటుంటే..."

"నా ఆలోచనలతో పెద్దసంబంధం లేకుండానే జరిగిపోతున్నాయన్నీ...ప్రవాహంలా మీదపడుతున్న ఈ పరిస్థితులనుంచి తప్పించుకు పారిపోలేను. ఎదురీదే ధైర్యమూ లేదు." నిర్లిప్తంగా అంది.

"అంటే..." అర్థం, కానట్లు చూశాడామె వైపు రవీంద్ర.

నవ్వింది మాలతి, "ఏం లేదు బావా! నాకు ఈ ఐశ్వర్యాన్నించి, నీ ఆకర్షణనుంచి తప్పించుకు పోయే శక్తిలేదు. నువ్వంటే ఎంత అసహ్యం పెంచుకున్నా ... చేతులుచాచి తిరిగి రారమ్మని నువ్వు పిలువగానే నీ కౌగిట్లో ఒదిగి పోవటానికి సిద్ధపడుతున్న నా బలహీనతను చూచి ఆశ్చర్య పడుతున్నాను."

"అది బలహీనత కాదు. ఎన్ని తప్పులనైనా క్షమించ గలిగే స్త్రీల ఔదార్యం"

"ఊహూఁ కాదు కాదు. చిత్రమైన ప్రలోభం." మనసులో అనుకుంది మాలతి.

వెనక్కి పరుగిడుతున్న ప్రకృతిని చూస్తూ కూర్చుండి పోయింది.

"యిందాక నీతో మాట్లాడినత నెవరు?" అప్పుడే గుర్తుకు వచ్చినట్లు గబుక్కున అడిగాడు రవీంద్ర.

"నేను పేద దాన్నిగా...అతని మామూలు ఆశ పిల్లగా వున్నప్పటి నా స్నేహితుడు..." చెబుతున్న



వ్వుడు ఆమె కంఠం ఎందుకో వణికింది.

* *

ఆరోజు గుడివాడకు శాశ్వతంగా గుడ్‌బై కొట్టేస్తున్నారు రఘుపతిగారి కుటుంబం.

వారికి సెండాఫ్ యివ్వటానికి వచ్చినవారి సంఖ్య ఎక్కువగానే వుంది ప్లాట్‌ఫారంమీద.

ట్రైన్‌లో కిటికీ దగ్గరగా కూర్చున్న మాలతి మనసు ఎందుకో భారంగా అయిపోయింది. ఆమె కళ్ళు మాటిమాటికీ చెమర్చుతున్నాయి ఆ తడి కళ్ళల్లో ఎవరి ప్రతిబింబమో మెరిసే క్షణంకోసం ఆశగా ఎదురుచూస్తోంది ఆమె అంతరంగం.

అంతలో త్వరత్వరగా నడుస్తూ ఆమెను చేరుకున్నాడు గోపాలరావు మాలతి కళ్ళు సంతృప్తితో మెరిశాయి.

"మొన్ననే వీడ్కోలు చెప్పేసారుగా మీరు." అంది మలినహాసం చేస్తూ. "ఔను! కానీ ఆఖరుసారిగా...నువ్వు నా దగ్గర్నుంచి ఎప్పటికీ దూరమైపోతున్న ఈ సమయంలో నిన్ను చూడకుండా వుండలేకపోయాను. ఈ నా రాక నీకు బాధ కలిగిస్తే క్షమించు మాలా!" ఆమె చేతి నందుకొని మృదువుగా నొక్కి కళ్ళల్లోకి ఓసారి సూటిగా...బరువుగా విడువలేనట్లు చూశాడు గోపాలరావు.

కన్నీటితో నిండిన కనులను అతని దృష్టి నుంచి మరల్చుకొంది మాలతి.

* * *

"మాలా! అమ్మాయ్ మాలా! ఎంతసేపు నిద్ర. గోపాలరావుగారు వచ్చి చాలాసేపయింది. లే యిక" శారదమ్మ గొంతు విన్పిస్తోంది.

"ఆయన మళ్ళీ మళ్ళీ ఎందుకు వస్తున్నారు? మీరంత అవమానం చేసి పంపిస్తున్నా...దూరంగా నెట్టేస్తున్నా కూడా ఎందుకు వస్తున్నారిక్కడికి?"

మాలతి మాటలకి కంగారు పడింది శారదమ్మ.

"ఏమండీ! మాల ఏమిటేమిటో కలవరిస్తోంది యిలా రండొకసారి" గాభరాగా పిల్చింది రఘుపతి గారిని. ఒక ప్రక్క కూతుర్ని కుదిపి లేపుతూనే.

"అబ్బ! ఏమిటమ్మా? ఏమిటీ కంగారు పడుతున్నావ్" బద్ధకంగా కండ్లు నులుపుకుంటూ లేచి కూర్చుంది మాలతి.

"కంగారేంటె ఖర్మ. అర్థంపర్థం లేకుండా కలవరిస్తుంటే కంగారు లేక..." కుదుట పడుతూ నెమ్మదిగా అంది ఆమె.

"కలా!?" ఆశ్చర్యపోయింది మాలతి.

"లక్ష రూపాయల గురించి కపక్కా నీక్కలొచ్చింది." కాఫీ తాగుతూ వచ్చింది మాధురి.

"అంత మంచి కల మధ్యలో లేపేశావెందుకమ్మా? ఆ కల యింకా కంటిన్యూ అయితే బాగుండేది కదూ చెల్లాయ్!" మధుమూర్తి నవ్వాడు.

"ఛీ! పోరా అన్నయ్యా! వెధవ కల యింకా కంటిన్యూ అవటం ఏమిటి?" కోపంగా అనేసి బాత్ రూమ్ వైపు వెళ్ళింది మాలతి. గోపాలరావును చూడాలని చాలా ఆత్రుతగా వుందామెకు. జారి పోయిందనుకున్న పెన్నిధి తన చేతుల్లోనే వుందని తెలిశాక ఎంతో ఆనందంగావుంది. గబగబ ముఖం కడిగేసుకుని కుంకుమ దిద్దుకుని కాఫీ కప్పులు చేత్తో పుచ్చుకుని హాల్లోకి నడిచింది మాలతి.

"ఎందు కొచ్చారు మళ్ళీ అంటున్నావుట. ఎవర్నో నన్నేనా?" నవ్వుతూ అడిగాడు గోపాలరావు.

"ఊహుం కాదు. మిమ్మల్ననను ఎప్పటికీ అనలేను." అతని కన్నుల్లోకి ఆరాధనగా చూస్తూ మృదువుగా నెమ్మదిగా అంది మాలతి.

*

# రంగుటద్దాలు

**పైడిపాల**

హరివిల్లులా అందమైన జీవితాన్ని అక్షరాలతోకూర్చి
అరచేతిలో స్వర్గాన్ని చూపెడతావెందుకు? — ఆత్మవంచన!

ప్రణాళికల లభివృద్ధిని పట్టీలలో చూపిస్తున్న ప్రభుత్వంలా
మనిషిని మనీషినిచేసి మమ్మల్నెందుకు మభ్యపెడతావ్?
ఆరితేరిన వేశ్యమాత అలంకరించినంత మాత్రాన
వదువుకత్తె మగనాలిగా భాసించడం కేవలం భ్రమ!

వికసించిన నీ మేథలో వెల్లివిరిసిన భావాలతో
నీ ఊహాలోకంలో ఉన్నతుడైన మనిషిని సృజియిస్తూ
ఎదగలేని ఈ మనిషికీ ఏవోఏవో ఏవేవో ఆరోపిస్తూ
నీ వెరిగిన జగతిని మరుస్తున్నావ్!-మరెక్కడికో తీసుకుపోతున్నావ్!

కాని ఈ మనిషి ఏమాత్రం ఎదగలేదు — ఈ వ్యవస్థ మారలేదు
కాకపోతే మరోపదిమెట్లు క్రిందికిదిగజారిపోయి
మానవత్వాన్ని మర్చిపోతున్నాడు-దానవత్వాన్ని దత్తు తీసుకుంటున్నాడు
మమతలను దూరంచేసుకొని స్వార్థంముసుగులో సంచరిస్తున్నాడు.

సంకుచితత్వం సర్వత్రా ఆవరించింది-సౌభ్రాతృత్వం సమసిపోయింది.
త్యాగానికసలే తావులేదిక్కడ-అనురాగమనే పదంలేదీ నిఘంటువులో
జననీ జనకులకు సంతతి శత్రువులు — ఒకో కుటుంబం ఒకోయుద్ధభూమి
రాష్ట్రంనిండా రణరంగాలే! ఇంకా వసుధైక సామ్రాజ్యమనేవాళ్ళు [illegible]

స్నేహం అనేపదం తాలుకు స్వభావం మాత్రం పూర్తిగా మా[illegible]ది.
బజార్లో అమ్ముతున్నారు స్నేహాన్ని — కొనడానికి డబ్బుండాలిగాని
అధమం అధికారమైనా చాలు — ఆ పమిత్రులు అనేకమంది
అదీలేకపోతే ఆత్మవంచనసుకోక భట్రాజుపాత్ర ధరించా[illegible]మరి!

ప్రేమనే పదానికసలు అర్థంలేదు —
ప్రథమవీక్షణంలో ప్రేమ పుడుతుందనడం భ్రమ —అది వాంఛ
భార్య పోయిన మరునాడు రెండోపెళ్ళికి సిద్ధమయ్యే భర్తను
అవసరం తీరిన అబలను అమానుషంగా హత్యచేస్తున్న ప్రియుల్నీ
అడిగితే అర్థమవుతుంది — ప్రేమనే పదార్థం అసలురంగు — ఇంకా.... —
కట్నంకలసివస్తే కులాంతర వివాహానికి సిద్ధపడే ఆదర్శవాదులు కావలసినంతమంది!

మరి నీ రచనలో పాండవులనాటి సోదరత్వం,
రాముని పితృభక్తి, రాధేయుని మిత్రవాత్సల్యం
రోమియో జూలియట్, ఖయస్ — లైలాల ప్రేమోదంతాలూ, ఆదర్శాలూ
ఎందుకు ప్రతిబింబిస్తున్నాయి? — ఏమిటి నీ ఆశయాలు??
చేదు నిజాలను చిత్రిస్తూ జాగృతం చెయ్యి నీజాతిని
*రంగుటద్దాలలో* కలలనూ, కథలనూ కనబర్చకు కాలక్షేపానికి!